# మదర్ 2000

కోర్టు ఆవరణంతా వేలాది జనం గుమిగూడి వున్నారు...

పత్రికలు, టీవీ కెమెరాలు హడావిడిగా తిరుగుతున్నాయి... అంతా కోలాహలంగా వుంది. నల్లకోటు వేసుకుని తిరుగుతున్న లాయర్లలో సైతం ఊపిరాడని ఉత్కంఠ...

ఒక సంచలనాత్మకమైన తీర్పుకోసం ఆ రోజు ఆంధ్రదేశమంతా ఎదిరిచూస్తోంది.

కేసు దాఖలు చేసిన ఆ నలుగురు క్లయింట్లలోనూ ఉద్విగ్నత... ఇప్పటికీ పదకొండు సార్లు వాయిదా పడి 'ఎవరు అమ్మగా నిలుస్తారు ?' అన్న చర్యలతో జడ్జి రాక కోసం తుదితీర్పుకై వేలాది కళ్లు ఎదిరిచూస్తున్న క్షణాలవి...

లక్షలాది కేసుల్ని కళ్లతో చూడకపోయినా... ఈ కేసులో గెలవనున్న 'తల్లి'ని ఒక్క సారి చూడాలని న్యాయదేవతలో కూడా కళ్లగంతల్ని విప్పుకోవాలన్న ఆతృత... కుడి చేత్తో పట్టుకున్న న్యాయత్రాసులో కూడా ఏ తల్లికి అన్యాయం జరక్కూడదన్న ఊగిసలాట...

జనాన్ని అదుపు చేయడం పోలీసులకు కూడ సాధ్యపడట్లేదు.

అనంతంగా ఎదిగిన సైన్సు సృష్టికి ప్రతి సృష్టి చేస్తూ పరీక్ష నాళికలో మనిషికి ప్రాణం పోస్తే ఫలితంగా పుట్టనున్న 'టెస్ట్‌ట్యూబ్ బేబీ' కేసు అది. మరో వారం రోజుల్లోగా డెలివరి కానున్న పసికందు కోసం కొన్ని పరిస్థితుల్లో కోర్టుకెక్కిన ముద్దాయిలు నలుగురు...

సెమన్ డోనర్...భార్గవ.

ఓవరి డోనర్... సుగాత్రి

రెంటెడ్ మదర్... కుమారి వినీత.

ప్రయోగాలు నిర్వహించిన... డాక్టర్ లక్ష్మి

వీళ్లు నలుగురూ పుట్టబోయే ఆ బిడ్డ కోసం పోరాడుతున్నారు. చట్టరీత్యా...

పిల్లలు లేని శరత్, సుగాత్రి దంపతులు వంశాంకురం కోసం తపించి... వైద్య పరీక్షల్లో లోపం శరత్‌దేనని నిర్ధారణ అయ్యాక... శరత్ ప్రోద్భలంతో ముందు ప్రతిఘటించిన తర్వాత టెస్ట్‌ట్యూబ్ బేబిని కనడానికి కొన్ని నెలల మానసిక సంఘర్షణ తర్వాత ఒప్పుకుంది సుగాత్రి.

మేధావిగా పేరుపొందిన నిరుద్యోగి భార్గవని సెమన్ డోనర్ (వీర్యదాత)గా ఒప్పించాడు శరత్. ఫెర్టిలిటి క్లినిక్ ద్వారా ఈ ప్రయోగాలు నిర్వహించడానికి ఫ్యామిలీ డాక్టర్ లక్ష్మి ముందుకొచ్చింది. శరత్ ఒప్పందం ప్రకారం రహస్యంగానే ఈ ప్రయోగం మొదలైంది.

ప్రయోగశాలలో వైద్య పరికరాలతో సుగాత్రి గర్భాశయంలోంచి అండాన్ని తీసి... భార్గవ సెమన్‌లోని బలమైన శుక్రకణాన్ని విడదీసి పరీక్షనాళికలో సుగాత్రి ఒవరీని, భార్గవ శుక్రకణాన్ని ఫలదీకరణ జరిపించి... కొద్ది వారాల వరకూ దాన్ని టెస్ట్‌ట్యూబ్‌లోనే పొదిగించి ఆపరేషన్ ద్వారా ఆ చిరుపిండాన్ని సుగాత్రి గర్భంలో విజయవంతంగా ప్రవేశపెట్టింది డాక్టర్ లక్ష్మి. అప్పటివరకు భార్గవని చూడని సుగాత్రి కడుపులో బిడ్డ పెరుగుతుంటె పెరిగే కడుపును ప్రేమిస్తూ తన్మయంగా గడుపుతుంటె... సుగాత్రి గర్భసంచి పలుచగా వున్నందున ఏర్పడే ప్రమాదం దృష్ట్యా సుగాత్రి గర్భాశయంలోంచి పిండాన్ని తీసి... లక్ష రూపాయల ఒప్పందం మేరకు ముందుకొచ్చిన ఇంకా పెళ్లికాని వినీత కడుపులోకి పిండాన్ని మార్చింది డాక్టర్...

అయిదు నెలలు మోసి పిల్లాడ్ని కని ఇచ్చే రెంటెడ్ మదర్‌గా వినీత అగ్రిమెంట్... అప్పుడే అనుకోని సంఘటన జరిగింది...

శరత్ తండ్రి పుట్టబోయే బిడ్డకోసం పదికోట్ల రూపాయల ఆస్తి రాసి ఆక్సిడెంట్‌లో పోయాడు. అందరిలోనూ స్వార్థం జాలువిచ్చుకుంది. అప్పటివరకూ రహస్యంగా వున్న భార్గవ, వినీత, డాక్టర్ బిడ్డ తమదేనంటూ కోర్టుకెక్కారు. సుగాత్రి శరత్‌లు కూడా కోర్టు కెక్కక తప్పలేదు.

వాదోపవాదాలు బలంగా జరిగాయి.

అడ్వకేట్లు ఎవరికి వారు తమ క్లయింట్ల తరఫున బలంగా వాదించారు. బిడ్డ ...

అండాన్నిచ్చిన సుగాత్రికి చెందుతుందా ?

వీర్యాన్నిచ్చిన భార్గవ్‌కు చెందుతుందా ?

ఎనిమిది నెలలు మోసి కనబోతున్న వినీతకు చెందుతుందా ?

పరీక్షనాళికలో ప్రాణంపోసిన డాక్టర్ లక్ష్మికి చెందుతుందా ?

ఎవరా బిడ్డకు నిజమైన తల్లి... ?

కేసు పదకొండు సార్లు వాయిదాపడింది... ఈ రోజు తుది తీర్పు... జడ్జి రాకతో కోర్టు వాతావరణం ఒక్కసారిగా నిశ్శబ్దమైంది...

న్యాయదేవత చేతిలోని త్రాసు కలవరంగా ఊగిసలాడింది.

ధర్మాసనం మీద కూచొన్న న్యాయమూర్తి వైపు కళ్లల్లో కాగడాలు వేసుకొని చూస్తున్నారంతా...

గ్యాలరీలో ముందు వరుసలో సుగాత్రి, శరత్, డాక్టర్ లక్ష్మి, భార్గవ, వినీతలు కూర్చున్నారు. మొఖాల్లో ఉద్వృతమవుతున్న ఆందోళన.

కొద్ది నిమిషాల తర్వాత జడ్జి కోర్టు హాలు నోసారి పరికించి చూసి తీర్పుని వినిపించడానికి సన్నద్ధమయ్యారు... సూది వేస్తే వినిపించేంత నిశ్శబ్దం...

" మన రాష్ట్రంలో డాక్టర్ లక్ష్మి తలపెట్టిన టెస్ట్‌ట్యూబ్ బేబీ ప్రయోగం ఒక శైశవ యజ్ఞంగా సాగిందని కోర్టువారు భావిస్తున్నారు. బిడ్డని కనకముందే తనకే చెందాలని వినీత, సెమన్ దానం చేసినందుకు తనకే దక్కాలని భార్గవ, తన అండంతో పాదిగి ఎదిగిందని తనకే ఆ పాప చెందుతుందని సుగాత్రి, వీరందర్నీ కాదని ఆ పాపని సృష్టించింది తానేనని డాక్టర్ లక్ష్మి పెట్టిన కేసులకు, ఆ క్లయింట్ల తరపున లాయర్ల వాదనలు నెలరోజులు శ్రద్ధగా విని కోర్టువారు న్యాయన్యాయాలు పరిశీలించటం జరిగింది...

ఒక మనిషిని కృత్రిమ పద్ధతిలో సృష్టించే హక్కు మరో మనిషికి లేదని... అది సృష్టికార్యం వల్లే జరగాలి తప్ప మన సంస్కృతిని దిగజార్చకూడదని మతసంస్థలు పెట్టిన కేసుని గతంలో కొట్టివేయడం అందరికీ తెల్సిందే...

పుట్టబోయే బిడ్డలో ప్రతి ఒక్కరికి వాటా వుంది. న్యాయపరంగా ఈ బిడ్డ సృష్టికి ఎవరు ఎక్కువగా శ్రమించారన్నది కూడా అవసరమే... శ్రమపరంగా చూసినప్పుడు ఈ బిడ్డ డాక్టర్ లక్ష్మికి దక్కాలి కాని... భార్గవదెంత పాలుందో, సుగాత్రిదీ అంతే పాలుంది. వీళ్లని

మించి ఎనిమిది నెలలుగా మోస్తూ ఇంకా పెళ్లికాకుండానే త్యాగంతో బిడ్డని కనబోతున్న వినీత పాత్ర తక్కువేం కాదు.

నలుగురు లాయర్ల వాదనలు విన్నప్పటికీ ఎవరికీ సమంగా న్యాయం పంచలేని స్థితి ఏర్పడింది... రాజ్యాంగం ప్రకారం న్యాయమైన నిర్ణయం తీసికోవటం కోసం కేసుని పదకొండు సార్లు వాయిదా వేయాల్సి వచ్చింది.

కేసు పూర్వపరాలు పరిశీలించిన పిదప ఈ కేసుకు సంబంధించి అంతర్గతంగా వున్న అయిదో వ్యక్తి యొక్క త్యాగగుణం ఇక్కడ నివేదించాల్సి వస్తుంది. అతడు సుగాత్రి భర్తయిన శరత్...

భారత హిందూ సాంప్రదాయం ఒక స్త్రీ యొక్క అండాన్ని మరో పరాయి పురుషుడి శుక్రకణంతో కలపటం అక్రమ సంబంధంతో సమానమని ఘోషిస్తుంది. మతసంస్థలు పెట్టిన కేసు అందుకు తార్కాణం. అయితే సాంఘిక కట్టుబాట్లను కాలదన్ని... పిల్లలకోసం, వాళ్ళపై పెంచుకున్న మమకారం కోసం శరత్ భార్గవ శుక్రకణంతో కలవడానికి భార్యని ప్రోత్సహించడం సైన్సు రీత్యా అభినందించదగ్గదే...

జనం ఊపిరి పీల్చటం మరిచి వింటున్నారు.

"పాశ్చాత్యదేశ రీతుల్లో పిల్లలు కలగడానికి భార్యని ఈ విధంగా భర్త ప్రోత్సహించడం మామూలే అయినా అది తెలుగు ప్రజల ఆశ్చర్యానికి ప్రశ్నార్థకంగా మిగులుతోంది. శరత్ నిర్ణయానికి కోర్టువారు కూడా అభినందనలు తెలుపుతూ ఆ శిశువులో అతనికీ భాగం వుందని కోర్టువారు భావిస్తున్నారు. కాని కేసు రీత్యా అతడా బిడ్డను కోరనప్పటికి... సుగాత్రి తరపు న్యాయవాది ఈ విషయాన్ని బలపర్చడంతో అతడి త్యాగబుద్ధిని కూడా న్యాయపరంగా ఆలోచించాల్సి వచ్చింది...

ఈ బిడ్డకోసం తను కోర్టుకెక్కగానే లక్షల రూపాయల విలువైన తన ఫెర్టిలిటీ క్లీనిక్‌లోని అపూర్వమైన సామాగ్రిని, సైన్సు పరికరాలను ఎవరో ధ్వంసం చేసారని... ఆలోటుని పూడ్చడానికైనా శిశువు డాక్టర్ లక్ష్మికి దక్కాలనీ ఆమె తరపు వాదనని పరిగణనలోకి తీసుకోబడింది...

కొద్ది నెలలుగా మెదళ్ళు పిండి, పిడికిళ్లు బిగించి బల్లగుద్ది వాదించిన లాయర్లు అసహనంగా ఆందోళనగా వింటున్నారు.

... అంతేగాక భార్గవకు చెందిన పలు విషయాలు... వినీతకు చెందిన కొన్ని విషయాలు న్యాయపరిగణనలోకి తీసుకొని తీర్పుని నిర్ణయించాల్సి వచ్చింది.

విచిత్రమైన ఈ కేసుని నిశితంగా ... సూక్ష్మంగా పరిశీలించిన మీదట ఆ శిశువు... ఆ శిశువు...''

ఊపిరితిత్తులను ఉరికొయ్యలకు తగిలించినట్టు అంతా కొయ్యబారి వినే సమయం లో వినీత కడుపుపట్టుకొని మెలి తిరుగుతూ ఒక్కసారిగా అరిచింది.

కోర్టులో కలకలం...

పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయని వినీతని అంతా కోర్టు హాలు నించి ఆస్పత్రి తరలిస్తుంటే.., అక్కడ ఒక్క న్యాయదేవతకు మాత్రం ఒక పసికందు ఆర్తనాదం వినిపించింది...

"విజ్ఞానపు విద్రోహుల్లారా...

పరీక్ష నాళికల్లో మనిషికి ప్రాణం పోస్తేనేం... ?

మానవత్వాన్ని చంపినక...!! నాకీ జన్మం వద్దు....వద్దు...."

వినీతని ఆస్పత్రికి తరలించిన అరగంటకు న్యాయమూర్తికి ఫోనొచ్చింది.

"సార్...మృత శిశువు జన్మించింది..."

సైన్సు పునాదుల మీద పసికందుని బలిచేసి ఒక శై 'శవ' యజ్ఞం ముగిసింది.

(నా నవల 'బేబీ ఓ బేబీ' ఆధారంగా....)

★ ★ ★